క్లుప్తంగా

ఆయుష్మాన్ కార్డుకు దరఖాస్తులు

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా సీఎస్ఈ మేనేజర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెల్లరేషన్ కార్డు కలిగిన అర్హులని మీసేవ, కామన్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కుటుంబం మొత్తానికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తుందని పేర్కొన్నారు.

ఆలయానికి బంగారం వితరణ



కేటీదొడ్డి: మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి ఆలయానికి మండలంలోని పాతపాలెంకు చెందిన శ్రీనివాసురావు, అరుణమ్మ దంపతులు శనివారం తులం బంగారాన్ని ఆలయ పెద్దలు నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం దాతలు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు శేషిరెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌కు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటీవల బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఎన్నికైన ఎం.జీ కృష్ణను శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు, శ్రేణులు ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తాలోని ఆయన నివాసంలో కలిసి పూలబొకెతో శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, అనిల్‌కుమార్, సీనస్‌రెడ్డి, ముని, లక్ష్మణ్, తిరుపాల్, బీసన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ పాదయాత్ర



గద్వాల అర్బన్: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన పాదయాత్ర శనివారం జిల్లా కేంద్రం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై అనుసరిస్తున్న విధానం ఏ మాత్రం తగదన్నారు అనంతరం అక్కడి నుంచి పాదయాత్రను ఎర్రవల్లివైపునకు కొనసాగించగా.. మార్గమధ్యలో తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీలో అధికార ప్రతినిధి మంద జగన్నాథం పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్‌కు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పాదయాత్రలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ యాదగిరి, జంగయ్య, కొంకల భీమన్న, మస్తాన్, రాజు, పరశురామ్, అశోక్ తదితరులు ఉన్నారు.

చల్లాకు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చల్లా వెంకట్రామిరెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని చల్లా వెంకట్రామిరెడ్డిని కార్యాలయంలో కలిసి పూల బొకె అందించి శాలువాతో సత్కరించారు. లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణ నాయుడు, లాయర్ మహేష్, సుధాకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవిప్రకాష్, నర్సింహులు, ఉపేంద్ర, తదితరులు ఉన్నారు.

'దొరల పాలనకు చరమగీతం పాడుదాం'

గద్వాల అర్బన్: రాష్ట్రంలో దొరల పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, గద్వాల ఇన్‌చార్జ్ గంజిపేట రాములు అన్నారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ముండల, పట్టణ అధ్యక్షులకు పార్టీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీడీపీ హయాంలోనే తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడింది టీడీపీ అన్నారు. నాయకులు ఇస్మాయిల్, మద్దిలేటి, రవి యాదవ్, గోవిందు, వెంకటన్న, తిరుమలేష్ పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టదా?

- ఆర్డీఎస్ కెనాల్‌పై ప్రయాణం
- పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు
- ద్విచక్రవాహనాలతో సహా కాల్వలో పడుతున్న రైతులు
- కల్వర్టు నిర్మించాలని కోరుతున్న వాహనదారులు



మోటార్‌సైకిళ్లపై పొలాలకు వెళ్తున్న తనగల రైతులు

శాంతినగర్: వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తులు కాపాడుకోవాలని ఓవైపు రైతులు తాపత్రయ పడుతున్నారు. మరోవైపు పొలాలకు వెళ్లి వ్యవసాయం చేసుకుందామంటే కెనాల్‌పై శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా ఉన్న ఇనుప వంతెనలపై ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి, అయిజ, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లో ఆర్డీఎస్ ప్రధాన కాల్వ ప్రవహిస్తోంది. తెలంగాణ సరిహద్దులో 48 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న కెనాల్‌పై ఆవలి వైపున ఉన్న పొలాలకు వెళ్లడానికి 70 ఏళ్ల కిందట ఇనుపఛానల్లు, వాటిపై రేకులు అమర్చి కాలి నడకన కూలీలు, రైతులు వెళ్లడానికి తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. వర్షపు నీరు నిలిచి తుప్పుపట్టిన ఇనుప రేకులు భారీగా రంధ్రాలు పడ్డాయి. ఇనుప ఛానళ్లు వంగిపోయాయి. గ్రామాలకు ఆవలి వైపున ఉన్న పొలాలకు వెళ్లడానికి ప్రమాదమని తెలిసినా.. విధిలేని పరిస్థితుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు వంతెనలపై వెళ్తూ...

గతంలో నడుచుకుంటూ చిన్నపాటి మార్గాలపై వెళ్లే రైతులు ప్రస్తుతం మోటార్ సైకిళ్లపై వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మూడడుగుల మేర ఏర్పాటు చేసిన తాత్కాలిక ఇనుప వంతెనలపై వెళ్తూ ఆర్డీఎస్ కాల్వలో పడి ప్రమాదాల పాలవుతున్నారు. నీళ్లున్న సమయంలో వాహనాలు, రైతులు, కూలీలు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. నీళ్లు లేని సమయంలో రైతులు కెనాల్‌లో పడి కాళ్లు, చేతులు విరిగిపోయి అవిటివాళ్లయిన సంఘటనలు ఉన్నాయి. ఈత రాక కొందరు కొట్టుకుపోతుండగా.. తోటి రైతులు, కూలీలు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చిన సంఘటనలు ఉన్నాయి.

ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే..

ఆర్డీఎస్ కెనాల్‌పై సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఒక చిన్న కల్వర్టు చొప్పున ప్రధాన కూడళ్ల వద్ద నిర్మించారు. ఒక్కో కల్వర్టుకు చాలా దూరం ఉండటంతో సమీపంలోని ఛానల్‌పై రైతులు ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కెనాల్‌లో పొలాలు కోల్పోవడమే గాక మా పొలాలకు మేము వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని ఆవలి వైపున పొలాలు ఉన్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటికి నోచుకోవడంలేదు..

అటు పొలాలు కోల్పోవడమే గాక సాగునీటికి నోచుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. కెనాల్ తవ్వే క్రమంలో తమ పొలాలు కోల్పోయామని, పొలాలు పోయినా తమకు సాగు నీరందడం లేదని చెబుతున్నారు. దిగువన ఉన్న పొలాల కోసం డిస్ట్రిబ్యూటరీలు నిర్మించారని, ఎగువన ఉన్న పొలాలకు నీరు పారుదల కావడంలేదని, అటు పొలాలు కోల్పోయి పరిహారం ఇవ్వలేదని, ఇటు నీటిపారుదల లేక రెండు విధాలా చెడిన రేవడిలా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..



ఆర్డీఎస్ కెనాల్‌పై తెలంగాణ పరిధిలో ఆరు చోట్ల తాత్కాలిక ఇనుప వంతెనలు ఏర్పాటు చేశాం. మూడు బాగున్నాయి. మూడు చోట్ల ఇబ్బందికరంగా ఉంది. రేకులు కొత్తవి ఏర్పాటు చేసి, మరమ్మతు చేయించి సమస్య పరిష్కరిస్తాం. ఉన్నతాధికారులకు సమస్య వివరిస్తా.

– శ్రీనివాసులు, ఏఈ, నీటిపారుదల శాఖ

కౌలుకు ఇచ్చాను..



మా పొలాలు జూలెకల్ ఆర్డీఎస్ ప్రధాన కాల్వ ఎగువన 30 ఎకరాలు ఉన్నాయి. మా పొలాల్లో అప్పట్లో ఆర్డీఎస్ కాల్వ తవ్వారు. గ్రామానికి కిలోమీటర్ దూరంలో పొలానికి నేరుగా బాట ఉండేది. కెనాల్ తవ్వడంతో బాటలేకుండా పోయింది. మనుషులు దాటడానికి ఇనుప ఛానల్ ఏర్పాటు చేశారు. రేకు మొత్తం తుప్పుపట్టి పోయింది. కేవలం రెండు ఛానళ్లు మాత్రమే మిగిలాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో పొలాలు సాగుచేయలేక అవతల వైపున ఉన్న యాపదిన్నె రైతులకు కౌలుకు ఇచ్చాం.

– శ్రీధర్‌రావు, రైతు, జూలెకల్

రంధ్రాలు పడింది..



తనగల సమీపంలోని ఆర్డీఎస్ కెనాల్‌పై తుమ్మిళ్ల లిఫ్ట్ నీరు పైప్‌లైన్ ద్వారా వచ్చే వద్ద ఏర్పాటు చేసిన ఇనుప వంతెన తుప్పుపట్టి పెద్ద రంధ్రాలు పడింది. కెనాల్‌పై వచ్చి పొలాలకు వెళ్లాలంటే మోటార్‌సైకిల్‌పై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాలి నడకన వెళ్లాలంటే రంధ్రాల్లో పడిపోతామనే భయంతో చుట్టూ ఐదు కిలోమీటర్లు తిరిగి పొలాలకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ధాన్యం ఇళ్లకు చేర్చాలంటే ఎడ్ల బండ్లు ఉన్నా.. కిరాయి ట్రాక్టర్లపై దూరంగా ప్రయాణించి తెచ్చుకుంటున్నాం.

– చంద్ర, రైతు, తనగల

సామాజిక అంశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డిలో శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కళా బృందం సభ్యులు, షీ టీమ్స్ సభ్యులు గ్రామ ప్రజలకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, షీ టీమ్స్, డయల్ 100, పోలీస్ చట్టాలతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పోకడల గురించి పాటల, మాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కళా బృందం సభ్యులు మాట్లాడారు. సైబర్ నేరాలతో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరికైనా ఏదైన ఇబ్బందులు జరిగినా అపరిచిత వ్యక్తులపై అనుమానం ఉన్నా.. వెంటనే డయల్ 100కి సమాచారం అందించాలన్నారు. అనంతరం షీ టీమ్స్ సభ్యులు మాట్లాడారు. ఎక్కడైనా విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్ నంబర్లను 8712670312, 799313139 సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. బాలికలను లైంగికంగా వేధిస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో షీ టీమ్స్, కళా బృందం సభ్యులు హనుమంతు, రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

ధ్యానంతో వ్యాధుల నివారణ



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న రాజమోహన్

మానవపాడు: ప్రతి రోజు శ్వాసమీద ధ్యాస.. ధ్యానం చేయడంతో వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్తలు రాజమోహన్, బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మద్దూరు, ఎ.బుడ్డిపాడు, కలుకుంట్ల, శ్రీనగర్, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడులో ధ్యానంపై శిక్షణ ఇచ్చి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యుక్త వయసులో గుండె జబ్బులు, షుగర్, బీపీ వ్యాధులు సంభవించి అనారోగ్యాల బారిన పడుతున్న ప్రతిఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. జీవన విధానంలో ఆహారపు అలవాట్లను మార్చుకుని శాఖాహార జీవితం, ధ్యాన జీవితం అలవాటు చేసుకోవాలని సూచించారు. ధ్యానం చేయడంతో తలనొప్పి, క్యాన్సర్, ఎలాంటి జబ్బులైనా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బంగ్లా ఆంజనేయరెడ్డి, సంగు వెంకటేశ్వర్లు, గుండం తిరుపతయ్య, శైలజ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, స్వప్న, శోభిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టవా?



మల్దకల్‌లో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ధరూరు: గ్రామాల్లోని సమస్యలను పాలకులు, అధికారులు పట్టించకోవడం లేదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రం ధరూరులో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామంలో తిరిగి ఆయా కాలనీలోని సమ్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గద్వాల – రాయిచూరు ప్రధాన అంతర్రాష్ట్ర రహదారి గుంతలమయం కావడంతో ఇటీవల డస్ట్ వేశారని, తద్వారా పెద్ద ఎత్తున వస్తున్న దుమ్ముతో రోగాలపాలవుతున్నామని ఎరుకలి వీధి వాసులు తెలియజేశారు. అలాగే డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, మురుగంతా ఒక చోట చేరి దుర్వాసన వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆంజనేయులు, జగదీష్, కృష్ణ, దరెప్ప, సవారన్న, రాములు, వెంకటేష్, గోవిందు, రంగస్వామి, పరశురాముడు, సుదర్శన్, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పోరాటం

మల్దకల్: గద్వాల నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకే తమ పోరాటం కొనసాగిస్తున్నామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రం మల్దకల్ బస్టాండ్ చౌరస్తా సమీపంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేస్తున్న వారిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నడిగడ్డలో ఇప్పటికే సీడ్ పత్తి రైతుల పక్షాన ఎన్నో పోరాటాలు చేసి రైతులకు న్యాయం చేయడం జరిందన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, విష్ణు, కిష్టన్న, ప్రేమ్‌రాజ్, తిమ్మప్ప, గోపాల్, అంజి, స్వామి, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

బైక్, కారు ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

కొత్తకోట: అతి వేగంతో వెళ్తున్న ఓ కారు, ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని కానాయపల్లి సమీపంలో చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు వనపర్తికి చెందిన డ్రైవర్ వెంకటేశ్ కారులో కొత్తకోట నుంచి వనపర్తి వైపు వెళ్తుండగా.. అదేమార్గంలో వనపర్తికి చెందిన బాలకృష్ణ బైక్‌పై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ వెంకటేశ్ తన కారును వేగంగా నడపడంతో అదుపుతప్పి ముందు వెళ్తున్న బాలకృష్ణ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విశ్వశాంతి పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అలంపూర్: ఇంట్లో ఉండే కష్టాలు, ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఉన్నత విద్యలో రాణించాలని ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి హృదయరాజు, రాష్ట్ర రీసోర్సుపర్సన్ విష్ణువర్ధన్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి ఇంటర్మీడియెట్, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇంటర్‌లో, 10వ తరగతిలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 21 మంది విద్యార్థులకు రూ.1.13 లక్షలను పాఠశాల యాజమాన్యం అందజేశారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన 20 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులకు రూ.42 వేలు మొత్తం రూ.1.55 లక్షలు ప్రోత్సాహకంగా నగదు అందజేశారు. వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా నోడల్ అధికారి, రాష్ట్ర రీసోర్సుపర్సన్లు మాట్లాడారు. ఈ నెల 15న పరీక్షలు రాయడానికి ఇంటర్ విద్యార్థులు సిద్ధం కావాలన్నారు. పరీక్షలకు నాలుగు రోజుల సమయం ఉండటంతో కొత్త సిలబస్‌కు వెళ్లవద్దన్నారు. ఇప్పటి వరకు బాగా చదివిన సిలబస్‌ను రివిజన్ చేసుకోవాలన్నారు. పరీక్ష సమయాల్లో చదవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో మంజుల, సమన్వయకర్తలు సునిల్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శనివారం ఎస్ఓ అనురాధ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పరీక్షల ముందు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు, జానపద గీతాలు నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవపాడు కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

టీఎస్‌టీయూ నాయకుల ప్రచారం

శాంతినగర్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో సిట్టింగ్ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి ఎంతో కృషిచేశారని ఆయనకే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిద్దామని తెలంగాణ స్టేట్ టీచర్స్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో చివరి రోజైన శనివారం టీఎస్‌టీయూ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌టీయూ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జాయింట్ సెక్రటరీ మురళీధర్ మాట్లాడారు. కేజీబీవీ పాఠశాలల్లోని ఫ్యాకల్టీకి పన్నెండు నెలల వేతనం, 180 రోజుల ప్రసూతి సెలవులు, 15 సాధారణ సెలవులు, డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులకు టైమ్‌స్కేల్, పీఈటీ అప్‌గ్రెడేషన్ జీఓ మంజూరు చేయించడంలో కాటేపల్లి జనార్దన్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు. సమావేశంలో ఉపాధ్యాయుడు సురేష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వండి'

అయిజ: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ఎమ్మెల్సీ బరిలో దిగిన గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఉపాధ్యాయులు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అయిజ మున్సిపల్ కౌన్సిలర్ గిత్తల దేవరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయన్న, ఉండవెల్లి మండల అధ్యక్షుడు గోపాల్, ఎనుముల నాగరాజు, నాగ శిరోమణి, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు



పుల్లూరు నుంచి వెళ్తున్న విద్యార్థులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకి బస్సు సౌకర్యం కరువైంది. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు గ్రామ ప్రజలు, విద్యార్థులు, ప్రైవేట్ ఉద్యోగులు కర్నూల్‌కు, మండలానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తున్నారు. రెండు రోజుల్లో ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీరికి ఎటువంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. పుల్లూరు, కలుగోట్ల, మెన్నిపాడు, గ్రామాల ప్రజలకు అలంపూర్‌కు వెళ్లి పరీక్షలు రాయాల్సి ఉండగా.. బస్సు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తక్కశీల, ప్రాగటూరు, మారమునగాల గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా అలంపూర్‌కు వెళ్లి ఇంటర్ పరీక్షలు రాయాల్సి ఉంది. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐక్యతకు ప్రతీక రాజావళి ఉర్సు

అమరచింత: పట్టణంలో వెలిసిన శ్రీ సయ్యద్ షా రాజావళి దర్గా షరీఫ్ ఉర్సు ఘనంగా కొనసాగుతుంది. ఉర్సు సందర్భంగా శనివారం తాజేచిరాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా షరీఫ్‌ను దర్శించుకునేందుకు వచ్చిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ భక్తిశ్రద్ధలతో చాదర్‌ను సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్సులు గ్రామాల్లో ఐక్యతను చాటుతాయన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ నిర్వహించుకునే వేడుకలు భావితరాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. పట్టణ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మలీద ముద్దలు, కొబ్బరి కాయలతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్ఏ రాజు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా, రాజేందర్‌సింగ్, రమేష్ ముదిరాజ్, అక్కల నరసింహులు గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గట్టు: మండలంలోని బల్గెరకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. గద్వాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీకే అరుణ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నల్లారెడ్డి, రాంరెడ్డి, వీరారెడ్డి, చంద్రశేఖర్, గొర్ల భీమన్న, కేటీ నాగేష్, కుర్వ ఈరన్న, మేస్త్రి తిమ్మప్ప, రామస్వామి తదితరులు బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. డీకే అరుణ వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ కన్వీనర్, రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు, బల్గెర శివారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

నల్లారెడ్డికి పార్టీతో సంబంధం లేదు..

బల్గెర నల్లారెడ్డికి బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ గట్టు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ వాహబ్, నాయకులు చంద్రశేఖర్, వెంకటన్న తెలిపారు. బల్గెర నల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండేవారని, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కూడా ఆయనకు లేదన్నారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.



కేసు నమోదు

గద్వాల క్రైం: వ్యక్తి అదృశ్యమైన సంఘటన గద్వాల మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ఆనంద్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుంటిపల్లికి చెందిన గువ్వల బీసన్న ఈ నెల 9న భార్య సుజాతతో చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండు రోజులుగా భర్త ఇంటికి రాకపోవడంతో శనివారం సాయంత్రం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు.

కార్మిక హక్కులు కాలరాయొద్దు

అమరచింత: ఉపాధి కూలీలకు కనీస వేతనాలను అమలు పర్చాలని ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో శనివారం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఉపాధి కూలీలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు, కేంద్ర ప్రభుత్వం తమ తప్పుడు విధానాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని ఇప్పటికీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు.